క్లుప్తంగా

ఉల్లి రైతులకు ఎకరాకు రూ.50వేలు ఇవ్వాలి

కోసిగి: ఉల్లి పంటను సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి తిమ్మయ్య, తాలుకా అధ్యక్షుడు ఎం.గోపాల్‌లు డిమాండ్ చేశారు. సోమవారం కోసిగిలోని బోయ వీరేష్ రైతు పొలంలో పంటను రైతు సంఘం మండల అధ్యక్షుడు తాయన్నతో కలిసి పంటలను పరిశీలించారు. వారు మాట్లాడుతూ కోసిగి మండలంలో అత్యధికంగా ఉల్లి పంటలను సాగుచేసుకున్నారన్నారు. గిట్టుబాటు ధరలకు ఉల్లి పంట పశువుల మేతగా, మరికొందరు దిబ్బలకు చల్లుకోవాల్సి వచ్చింది. ప్రభుత్వమే నేరుగా క్వింటా రూ.3వేలు లకు కొనుగోలు చేయాలన్నారు. అలాగే నష్టపోయిన రైతులకు హెక్టారుకు కాకుండా ఎకరాకు రూ.50వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం నాయకులు ఓంకార్ స్వామి, పరుశురాముడు, రాజసింగం, నరసింహులు, చార్లెస్, వీరేష్, వీరన్న, గుండప్ప తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

నందవరం : ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం(పీజీఆర్ఎస్) ద్వారా ప్రజలు, రైతులు ఇచ్చిన అర్జీలను స్వీకరించారు. అర్జీలపై నిర్లక్ష్యం వహించొద్దని అధికారులను హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జీ ఎంపీడీఓ కృష్ణమూర్తి, మండల సర్వేయర్ అక్బర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన

నందవరం : హెచ్ఐవీపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రోగామ్ ఆఫీసర్ దేవేంద్ర సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో స్వచ్ఛంద సేవ సంస్థ విజయ మహిళ మండలి సభ్యులు ఆధ్వర్యంలో మండల అధికారుల తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ కృష్ణమూర్తి చేతుల మీదుగా హెచ్ఐవీపై పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆ సంస్థ సభ్యులు ఆర్టీసీ బస్టాండ్, ఆటో స్టాండ్, ఇంటింటికి తిరిగి హెచ్ఐవీపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో విజయ మహిళ మండలి సభ్యులు ఏఎస్ఎం సౌజన్య, హసీనా, ప్రమీలా, ఎస్తేరమ్మ, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

లంపీ స్కిన్‌పై అప్రమత్తంగా ఉండండి

నందవరం : పాడి రైతులు పశువులకు సోకే లంపీ స్కిన్ వైరస్ పట్ల అప్రమత్తంగా ఉండి టీకాలు వేయించుకోవాలని వెటర్నరీ డాక్టర్ నరేంద్రనాథ్ రెడ్డి సూచించారు. సోమవారం మండల పరిధిలోని గంగవరం, జోహరాపురం గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో వైద్యులు పశువులకు టీకాలు, గేదెలకు చూడి పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ..పశువులకు ప్రస్తుతం లంపీ వైరస్ సోకిందని, ముందు జాగ్రత్తగా టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వెటర్నరీ సహాయకులు, గోపాల మిత్ర సభ్యులు పాల్గొన్నారు.

క్షయవ్యాధిని అంతం చేయడమే లక్ష్యం

ఆదోని టౌన్: క్షయవ్యాధిని అంతమొందించడమే మన లక్ష్యమని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ షేకున్‌బాను, డాక్టర్ అనిల్‌కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని రాజరాజేశ్వరి నగర్‌లో టీబీ ముక్త్ భారత్ కార్యక్రమం చేపట్టారు. వార్డులో ర్యాలీ నిర్వహిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం ఉన్నవారు, గళ్లలో తెమడ, రక్తం పడడం, ఛాతిలో నొప్పి తదితర లక్షణాలు ఉన్న వారు ప్రభుత్వ ఆసుపత్రిలో గళ్ల పరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, జ్ఞానేశ్వరి, సుబ్బమ్మబాయి, ఏఎన్ఎం జె.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ తిక్కన్నకు నివాళి

ఆదోని రూరల్: విప్లవోద్యమ కార్మిక నేత, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు, ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యదర్శి కామ్రేడ్ కె.తిక్కన్న 3వ వర్ధంతి సభను సోమవారం పట్టణంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి కె.నాగరాజు, కామ్రేడ్ తిక్కన్న భార్య సుశీలమ్మ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు కె.సోమశేఖర్, సీపీఐ (ఎంఎల్) చంద్రపుల్లారెడ్డి, పార్టీ నాయకులు కె.నరసన్న, నాయకులు ఉసేన్‌బాషా, నరేంద్రబాబు, శివరాం తదితరులు పాల్గొన్నారు.

లెదర్‌సొసైటీ అక్రమార్కులపై చర్యలు తీసుకోండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని లెదర్ సొసైటీలో అక్రమాలకు పాల్పడుతున్న వారిపై వెంటనే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని జైభీం ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు చిక్కం జానయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ శేషఫణికి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. లెదర్ సొసైటీలోని దళిత వర్గానికి చెందిన సభ్యులుండగా వారి షేర్లు ఇవ్వకుండా బతికిన వారిని చనిపోయినట్లు చూపించి కోట్ల రూపాయాలు దన్నుకుంటున్నారని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన తారకేష్, రఘునాథ్‌లపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు సామెల్, గుంటెప్ప, రవి,అబ్రహం తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం

- అమ్మవార్లకు పసుపు కుంకుమార్చనలు
- వివిధ రూపాల్లో అలంకరణ
- దర్శించి తరించిన భక్తులు

ఆదోని అర్బన్: దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. అమ్మవారి దేవాలయాల్లో ఆలయ నిర్వాహకులు, ఆయా కాలనీల్లో కొలువుదీర్చిన మండపాల్లో నిర్వాహకులు అమ్మవార్లకు పసుపు, కుంకుమార్చన గావించి ప్రత్యేకంగా వివిధ రూపాల్లో అలంకరణ చేశారు. ఆదోని ఇలవేల్పు శ్రీ మహాయోగి లక్ష్మమ్మవ్వ, నగరేశ్వరస్వామి ఆలయంలో వెలిసిన శ్రీ వాసవీమాత, ఎమ్మిగనూరు రోడ్డులో వెలిసిన శ్రీ గంగాభవానీమాతకు పసుపు, కుంకుమ అలంకరణలో దర్శనమిచ్చారు. అంతేగాకుండా ఫారెస్ట్‌లైన్ అంబాభవానీమాతను బాలాత్రిపుర సుందరీగా అలంకరించగా, కుమ్మరిగేరిలో దుర్గామాతగా కొలువుదీరారు.


శైలపుత్రి దేవిగా మంత్రాలయం మంచాలమ్మ


ఆదోనిలో పసుపు, కుంకుమ అలంకరణలో వాసవీ మాత


ఎమ్మిగనూరు రోడ్డులో గంగాభవానీమాత..


త్రిపురసుందరీదేవిగా ఫారెస్ట్‌లైన్ అంబాభవాని


కుమ్మరిగేరిలో కొలువుదీరిన దుర్గామాత

శైలపుత్రి అలంకరణలో మంచాలమ్మ


మంత్రాలయం రూరల్ : దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా గ్రామ దేవత మంచాలమ్మ శైలపుత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అరటి, మామిడి తోరణాల్లో అమ్మవారు వెండి ఆభరణాలతో వెలుగొందారు. వేడుకల్లో భాగంగా ముందుగా గ్రామ దేవతకు నిర్మల్య విసర్జన గావించి పసుపు, కుంకుమార్చనలు, వెండి ఆభరణాలతో అలంకరణ గావించారు. నవరాత్రుల్లో మొదటి రోజు కావడంతో భక్తుల వేలాదిగా తరలివచ్చి అమ్మవారి సేవలో తరించారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య సత్రంలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవిగా దర్శనమిచ్చారు.

బాలత్రిపుర సుందరి దేవిగా..

పెద్దకడబూరు : శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో వెలసిన చౌడేశ్వరిదేవి అమ్మవారు, కాళీకాదేవి అమ్మవారు, మండల పరిధిలోని దొడ్డిమేకలలో వెలసిన పార్వతీదేవి బాలత్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులను కనువిందు చేశారు. మండల కేంద్రంలోని లక్ష్మమ్మవ్వలతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాలలో వెలసిన అమ్మవార్లు వివిధ రూపాలలో ఆశీనులయ్యారు. ముందుగా ఆలయ పూజార్లు నరసింహాచారి, శరవయ్యాచారి, వీరభద్రయ్య, ఉదయం జలాభిషేకం, పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, బిల్వార్చన, అభిషేకాలు వంటి ప్రత్యేకపూజలు నిర్వహించారు. నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


పెద్దకడబూరులో బాలత్రిపుర సుందరి దేవిగా..


దొడ్డిమేకలలో బాలత్రిపుర సుందరి దేవిగా పార్వతీదేవి


పెద్దకడబూరులో బాలత్రిపుర సుందరిదేవిగా కాళికాదేవి


బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో శాంభవి దేవి


ఎమ్మిగనూరు వీవర్స్ కాలనీలో బాలత్రిపుర దేవి

బాలత్రిపుర సుందరి దేవిగా శాంభవి దేవి

కోసిగి: మండలంలో దసరా శరన్నవరాత్రి వేడుకలు సోమవారం ప్రారంభమైయ్యాయి. మండలంలోని కందుకూరు గ్రామంలో వెలసిన శాంభవి దేవి శరన్నవరాత్రి మొదటి రోజున బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మల్లికార్జున స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకం, పంచామృతాభిషేకం, నూతన పట్టువస్త్రాలు, వెండి కవచంతో అలంకరణలు గావించి, ఫలపుష్పాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో దేవి పురాణ పఠణం భక్తులచే ప్రవచింప జేశారు. అలాగే కోసిగిలో కాళికాదేవి ఆలయంలో, ఆర్లబండ అంబభవాని ఆలయాల్లో శరన్నవరాత్రి వేడుకలు నిర్వహించారు.

బాలత్రిపుర సుందరిదేవి రూపంలో అమ్మవారు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో సోమవారం దేవీ శరన్నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా పట్టణంలోని వీవర్స్ కాలనీ, గాయిత్రీ దేవి, వాసవీమాత ఆలయంతో పాటు పలు ఆలయాల్లో మొదటి రోజు అమ్మవారు పలు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్థానిక వీవర్స్ కాలనీ మైదానంలో స్వామివివేకానంద సేవా సంస్థ సభ్యులు ప్రతిష్ఠించిన అమ్మవారిని బాలాత్రిపుర సుందరిదేవిగా అలంకరించారు.

గురజాల క్షేత్రంలో దేవి శరన్నవరాత్రులు


ప్రత్యేకాలంకరణలో రాలమింగేశ్వర స్వామి


రజక కవచ అలంకరణలో పార్వతీ దేవి

నందవరం : విజయ దశమి పండుగా సందర్భంగా పవిత్ర పుణ్య క్షేత్రం గురజాల రామలింగేశ్వర స్వామి క్షేత్రంలో దేవి శరన్నవరాత్రులు 11 రోజుల ఉత్సవాలలో భాగంగా మొదటి రోజు పార్వతీ దేవి రజక కవచ అలంకారణలో భక్తుల దర్శనిమిచ్చారు. సోమవారం పురోహితులు హంపేష్ స్వామి ఆధ్వర్యంలో రామలింగేశ్వర స్వామికి, పార్వతీ దేవికి జలాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చన వంటి విశిష్ట పూజలు గావించారు. అనంతరం గ్రామస్తులు బ్యాండు మేళాలతో అమ్మవారికి పట్టువస్త్రాలు సర్పించి ప్రత్యేక పూజలు చేపట్టారు. మహా మంగళహారతులు చేపట్టి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరస్వామి, గ్రామ పెద్దలు నరసింహారెడ్డి, శివారెడ్డి, నరసింహులు, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి


ప్రజా సమస్యలను వింటున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: ప్రజా సమస్యల వేగవంతంగా పరిష్కరించాలని, పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో వచ్చిన అర్జీలను ఏ ఒక్క అధికారి నిర్లక్ష్యం చేయకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసెల్ సిస్టం–పీజీఆర్ఎస్‌లో పాల్గొని డివిజన్‌లోని ఆయా మండలాల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. మండలంలోని ఆయాశాఖల అధికారులకు సంబంధించిన సమస్యలను తెలియజేస్తూ గడువులోపు పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బియాండ్ ఎస్ఎల్ఏలోకి వెళ్లకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ పరిపాలనాధికారి వసుంధర, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, డీఎల్‌పీఓ తిమ్మక్క, డీఎల్‌డీఓ బాలకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు సాహిత్య పురస్కారం ప్రకటించాలి


గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సాహితీ స్రవంతి సభ్యులు

ఆదోని సెంట్రల్: తెలుగు సాహిత్యంలో విశేష కృషి చేసిన గురజాడ అప్పారావుకు ప్రభుత్వం సాహిత్య పురస్కారం అందించాలని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షులు ఆవుల బసప్ప డిమాండ్ చేశారు. గురజాడ జయంతి వారోత్సవాల్లో భాగంగా సోమవారం నైస్ కంప్యూటర్ ఇన్‌స్టిట్యూట్‌లో సాహితీ స్రవంతి డివిజన్ అధ్యక్షుడు సక్కిర్ భాస్కర్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. అభ్యుదయ కవి గురజాడ అప్పారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భాస్కర్, అమలనాథం, ఓంకార్, షేక్షావలి, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

పని గంటల పెంపును తక్షణమే రద్దు చేయాలి

ఆదోని రూరల్: కూటమి ప్రభుత్వం పెంచిన 10 గంటల పని విధానాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కె.అజయ్‌బాబు, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు పి.ఈరన్న, పట్టణ ఏఐటీయూసీ కార్యదర్శి వెంకన్న, ఓ.బి.నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ మైదానం నుంచి భీమా సర్కిల్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పని భారం తగ్గిస్తామని టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చాక కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మెప్పు కోసం పని గంటలు పెంచారన్నారు. కార్మికులు, మహిళలు, ఉద్యోగులను కార్పొరేట్ ప్రైవేట్ పరిశ్రమల్లో కార్మికులు ఐక్యమత్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్మిక సంఘాల నాయకులు, పి.ఎస్.గోపల్, తిప్పన్న, లక్ష్మన్న, కుమార్, కృష్ణమూర్తి, అజీమ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక చట్టాల మార్పు శోచనీయం

ఎమ్మిగనూరుటౌన్: కేంద్ర ప్రభుత్వం తమ స్వర్థం కోసం కార్మిక చట్టాలను మార్పు చేయడం శోచనీయమని, ఆయా చట్టాలు పోరాడి సాధించుకున్నవని కార్మిక సంఘాల నాయకులు రాముడు, తిమ్మగురుడు, ప్రసాద్ అన్నారు. సోమవారం సీఐటీయూ, ఏఐటీయూసీ, ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్‌కోడ్లను తెచ్చిందన్నారు. ఆయా లేబర్ కోడ్లను అమలు చేయాలని ప్రధాని నరేంద్రమోదీ రాష్ట్రాలపై ఒత్తిడి తెస్తుండటం శోచనీయమన్నారు. ప్రధాని మెప్పుకోసం కూటమి ప్రభుత్వం నాలుగు లేబర్‌కోడ్లను రాష్ట్రంలో అమలు చేసేందుకు పూనుకోవడాన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయన్నారు. తక్షణం 10 గంటల పని విధానం రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు సురేష్, రాజు,ఇస్మాయిల్, విజయేంద్ర పాల్గొన్నారు.

పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం


బోరు నుంచి పైపులైన్ వేస్తున్న దృశ్యం

మంత్రాలయం రూరల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అవసరార్థం ఇటీవల ఎంపీ నిధులతో బోరుబావి తవ్వించడం జరిగింది. అయితే మూడు నెలలు కావొస్తున్నా అధికారులు పట్టించుకోలేదు. దీంతో ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి చొరవతో ఎంపీపీ నిధులతో బోరుకు మోటారు ఏర్పాటుతో పాటు పైపులైన్ కనెక్షన్ ఇచ్చారు. బోరు మోటార్‌కు కనెక్షన్ ఇవ్వడంతో పాఠశాలలో ఆర్వో ప్లాంట్, కుళాయిలకు తాగునీటి సరఫరా ప్రారంభం కానుంది. సదరు పనులను సోమవారం సర్పంచు తెల్లబండ్ల భీమయ్య దగ్గరుండి పూర్తి చేయించారు. పనుల పూర్తితో పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కారం కానుందని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకట్రాముడు తెలిపారు .

ఎరువుల దుకాణాల తనిఖీ


ఎరువుల నిల్వల రికార్డులను తనిఖీ చేస్తున్న ఏడీఏ

ఆదోని రూరల్: మండలంలోని ఎరువులు, పురుగు మందుల దుకాణాలను సోమవారం ఏడీఏ బాలవర్ధిరాజు, ఏఓ సుధాకర్ తనిఖీ చేశారు. ఎరువులు, పురుగుల మందుల నిల్వలు, స్టాకు వివరాలను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ ఈ తనిఖీల్లో శ్రీకృష్ణట్రేడర్స్ వద్ద రూ.81,100 విలువ గల స్టాకు అనుమతి పత్రాలు లేనందున ఆ స్టాకుపై అమ్మకాలు నిలుపుదల చేసినట్లు తెలిపారు. మండలంలోని అన్ని ఎరువులు, పురుగు ఒదుల డీలర్లకు ప్రభుత్వం అనుమతి పొందిన ఎరువులు, పురుగు మందులు, బయో–పెస్టిసైడ్స్ మాత్రమే విక్రయించలన్నారు.

సౌకర్యాలు కల్పించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని శివన్న నగర్‌లో ఎల్ లైన్ వీధితో పాటు పలు ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించి కాలనీ వాసుల సమస్యలు పరిష్కరించాలని చేనేత కార్మిక సంఘ నాయకులు కాలప్ప, కృష్ణ, సీఐటీయూ మండల కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. సోమవారం శివన్న నగర్ కాలనీ వాసులతో కలిసి వారు మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డిని కలిసి వినతి పత్రం ఇచ్చి సమస్యలను వివరించారు. వారు మాట్లాడుతూ చేనేత దినోత్సవాన్ని ఎంతో ఆర్భాటంగా గత నెలలో జరుపుకొన్నారే కానీ, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమౌతోందని ఆరోపించారు. కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘ నాయకులు నాగరాజు, యల్లప్ప, జయమ్మ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాల బంద్

కోసిగి: రాష్ట్ర ప్రైవేట్ డిగ్రీ కళాశాలల యాజమాన్యం ఆదేశాల మేరకు కోసిగిలో నారాయణ డిగ్రీ కళాశాల సోమవారం బంద్ చేసి నిరసన తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ ఉసేనయ్య, షేక్షావలి, అధ్యాపక బృందం చౌడయ్య మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత 16 నెలలుగా 6 విడుతలుగా (ఆర్టీఎఫ్) ట్యూషన్ ఫీజు, ఫీజురీయింబర్స్ మెంట్ నిధులు మంజూరు చేయలేదన్నారు. ఈ ఏడాదితో 7 విడుతలు కావస్తోందన్నారు. దీంతో రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలలు సంక్షోభానికి గురవుతున్నట్లు తెలిపారు. చాల మంది నిరుపేద విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

ప్రధాని చిత్రపటానికి పాలభిషేకం

ఎమ్మిగనూరుటౌన్/రూరల్: జీఎస్టీ తగ్గింపుపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చిత్ర పటానికి సోమవారం సోమప్ప సర్కిల్లో బీజేపీ నాయకులు పాలభిషేకం చేశారు. బీజేపీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జ్, కౌన్సిలర్ దయసాగర్, ఆత్మ నిర్భర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గురురాజదేశాయ్, బీజేపీ సీనియర్ నాయకులు లలిత్‌జైన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ దేశంలోని మధ్యతరగతి కుటుంబాలు దృష్టిలో పెట్టుకొని జీఎస్టీని తగ్గించారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా మాజీ ఉపాధ్యక్షులు బీఎల్ నారాయణ, నాయకులు మఠం రాజశేఖర్ స్వామి, ఉప్పర చరణ్, కురవ బడేసాబ్ తదితరులు పాల్గొన్నారు.

భూములపై హక్కులు కల్పించాలి

మంత్రాలయం రూరల్ : తమ పూర్వీకుల నుంచి తాము భూములు కలిగి ఉన్నామని మంత్రాలయానికి చెందిన కొందరు రైతులు ఆందోళనకు దిగారు. తమ భూములకు సంబంధించి అన్ని ధ్రువీకరణ పత్రాలు ఉన్నా రాఘవేంద్రస్వామి మఠం తమకు అడ్డుగా నిలుస్తోందన్నారు. శ్రీమఠం రికార్డులు, తమ రికార్డులు పరిశీలించి తమ భూములు తమకు అప్పగించాలని కోరారు. ఇటీవల శ్రీమఠం అధికా రులకు తమకు ఆర్‌ఓఆర్ అడంగల్ నోటీసులు పంపడం విడ్డూరంగా ఉందన్నారు. ఇప్పటికైనా తహసీల్దార్ తమ రికార్డులు పరిశీలించి అనుభవంలో ఉన్న తమకు భూములపై హక్కులు కల్పించాలని వేడుకున్నారు.

రైతులను ఆదుకోవాలి

పెద్దకడబూరు: అధిక వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. సత్యన్న డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ గీతాప్రియదర్శిని వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రైతులను ఆదుకునే విధంగా మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. నేటికి కరువు సహాయ నిధులు అందలేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంఘం నాయకులు బాలరాజు, బాబు, ఈరన్న, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉరుకుందలో పూజలు


పూజలందుకుంటున్న ఈరన్న స్వామి

కౌతాళం : మండల పరిధిలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామిని సోమవారం భక్తులు అధికంగా తరలివచ్చి దర్శించుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చిన భక్తులు స్వామి సన్నిధిలో పిండి వంటలు వండి స్వామి కి నైవేద్యం సమర్పించారు. తెల్లవారుజామున 5గంటలకు అర్చకులు స్వామి మూలవిరాట్‌కు సుప్రభాత సేవ, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను చేపట్టారు. భక్తులు క్యూ లైన్‌లో వచ్చిన స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసుకున్నారు.

ఆర్యవైశ్యులు అన్ని రంగాల్లో రాణించాలి


పట్టణంలో ఆర్యవైశ్య పతాకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘు అధ్యక్షుడు

ఎమ్మిగనూరుటౌన్: ఆర్యవైశ్యులు తమ పిల్లలకు ఉన్నత విద్యావంతులు చేసేందుకు కృషి చేయాలని, అప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరని రాష్ట్ర ఆర్యవైశ్య యువజన సంఘు అధ్యక్షుడు దూపకుంట్ల శబరి వరప్రసాద్ అన్నారు. శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలో ఆర్యవైశ్యులు బైక్‌ర్యాలీ నిర్వహించిన అనంతరం ఆర్యవైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో పదవ తరగతి, ఇంటర్, బీటెక్, ఎంటెక్, ఎంబీబీఎస్, సీఏ, నీట్, పీజీ మెడిసిన్‌లలో ప్రతిభ చాటిన ఆర్యవైశ్య విద్యార్థులు సిరిచందన, సాయిసిద్దార్థ, రాంప్రణీత్ గుప్త, జి.ప్రసూన, నిఖితాశ్రీ, శివతేజ, చిత్రాల విష్ణుష్, తులసి మహేష్, సారిక, నామ గోకుల్, గ్రంథే వెంకటసాయి గుప్త, గుర్రేవుల గౌతమి, బద్రీకృష్ణ, బచ్చుప్రియాంక, సాయి చరిత, గుర్రేవుల సంజీవ్ కుమార్‌లకు అమ్మవారి ప్రతిమతో కలిగిన సిల్వర్ మెడళ్లతో పాటు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో స్థానిక ఆర్య వైశ్య సంఘ నాయకులు ప్రతాప్ శ్రీకాంత్, దేవకి వెంకటేష్, రాజశేఖర్, హరిప్రసాద్, సుబ్బారావ్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ దురదృష్టకరం

కౌతాళం : మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయడం దురదృష్టకరమని మంత్రాలయం నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షుడు జైపాల్ విమర్శించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కాలేజీల ప్రైవేటీకరణ భవిష్యత్‌లో దళిత వర్గాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దీంతో వైద్య విద్యకు దళిత విద్యార్థులు దూరమవుతారని, వైద్యులు అయ్యే అవకాశం కోల్పోతామని ఆందోళన చెందారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలలకు శ్రీకారం చుట్టి ప్రేమను చాటారన్నారు. కానీ ప్రస్తుతం సీఎం చంద్రబాబు నాయుడు తీసుకున్న నిర్ణయం సరైనది కాదన్నారు. ప్రభుత్వం పునారాలోచన చేసి పేద విద్యార్థులను దృష్టిలో ఉంచుకుని మెడికల్ కళాశాలల పీపీపీ విధానాన్ని ఉపసహంరించుకోవాలన్నారు.

పట్టణ పరిశుభ్రతకు సహకరించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో పారిశుద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, ఇందుకు పట్టణ వాసులు కూడా సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి కోరారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని సున్నంబట్టి ఏరియాలోని ధోబీఘాట్ ప్రాంతంలో నిర్వహించిన పారిశుద్ధ్య పనుల్లో కమిషనర్ పాల్గొన్నారు. అనంతరం కర్నూలు రోడ్డులోని గోనెగండ్ల బైపాస్ రోడ్డులో నిర్మిస్తున్న సర్కిల్ పనులను పరిశీలించి సిబ్బందికి తగిన సూచనలిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ రాజునాయక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, ఏఈ శ్రీకాంత్,మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

ఆదోని రూరల్: రైతులు పండించిన ఉల్లి, టమాటతో పాటు అన్ని రకాల పంటలకు కూటమి ప్రభుత్వం కనీస మద్దతు ధర ప్రకటించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్‌యాదవ్, సీపీఐ ఆదోని మండల కార్యదర్శి కల్లుబావి రాజు, రైతు సంఘం డివిజన్ కార్యదర్శి మదిరి ఎల్లప్ప డిమాండ్ చేశారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయ సూపరింటెండెంట్ వసుంధరదేవికి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఉల్లిని ప్రభుత్వమే క్వింటాల్ రూ.3 వేలు చొప్పున, టమాటా కిలో రూ.20 ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. పత్తికి క్వింటాల్ రూ.10 వేలు ప్రకారం సీసీఐ ద్వారా కొనుగోలు చేయాలన్నారు. నాయకులు కొత్తరు గంగన్న, సీపీఐ నాయులు శేషప్ప, రైతులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కుటుంబానికి బలం

నందవరం : మహిళల ఆరోగ్యం కుటుంబానికి బలమని బీజేపీ బాధ్యుడు, దేశాయ్ నెట్‌వర్క్ అధినేత గురురాజ్‌దేశాయ్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని మిట్టసోమపురం గ్రామంలో పీహెచ్‌సీ డాక్టర్ రేవతి ఆధ్వర్యంలో స్వస్థ్ నారీ– సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మహిళలకు వైద్య పరీక్షలు చేపట్టారు. డాక్టర్ రేవతి మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలింతలు, చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడంతో పాటు అవగాహన కార్యక్రమన్ని వచ్చే నెల 2వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై హర్షం

ఆదోని అర్బన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించిన సందర్భంగా సోమవారం ఆదోనిలోని భీమాస్ సర్కిల్‌లో బీజేపీ సెంట్రల్ కమిటీ అధ్యక్షులు తోవి నాగార్జున ఆధ్వర్యంలో టపాకాయలు పేల్చి, మిఠాయిలు పంచి, సంబరాలు జరుపుకున్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విట్టా రమేష్, ఆదోని మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ ఆదూరి విజయ్‌కృష్ణ, బీజేపీ రాష్ట్ర నాయకులు లోకేష్, బీజేవైఎం మాజీ రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస ఆచారి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన కమిషనర్


జిల్లా కలెక్టర్ డాక్టర్ సిరికి పూలమొక్క అందజేస్తున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరిని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేసి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మిగనూరు మున్సిపాలిటీ గురించి కలెక్టర్ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన ఆదోని వీఆర్వోలు

ఆదోని రూరల్: కర్నూలు జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సిరిని ఆదోని వీఆర్వోలు ఈరన్న, రాజశేఖర్‌గౌడ్, తిరుమల్‌రెడ్డి సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వీఆర్వోలు ఎదుర్కొంటున్న సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు.